
ఏరియా ఆస్పత్రిలో సమస్యలను తెలుసుకుంటున్న కలెక్టర్ శశాంక

ఏరియా ఆస్పత్రిలో అధునాతన వసతుల కల్పనకు కృషి : కలెక్టర్ శశాంక

వనస్థలిపురం, జూలై 24(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలోని సమస్యలను పరిష్కరించి అధునాతన వసతులను కల్పించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందజేస్తామని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. బుధవారం వనస్థలిపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏరియా ఆస్పత్రిలో నూతన హంగులతో కూడిన మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలనే దృఢ సంకల్పంతో ఉన్న తెలంగాణ ప్రభుత్వం ఆలోచనలకు అనుగుణంగా ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఆస్పత్రిలోని సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని సమస్య పరిష్కారానికి కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ రాజు, డాక్టర్ కృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


షిరిడీ ఎన్‌క్లేవ్‌లో రోడ్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి

బోనాలనాటికి రోడ్లు బాగు చేయిస్తాం: కార్పొరేటర్

సరూర్‌నగర్, జూలై 24(ఆంధ్రజ్యోతి): వచ్చే ఆదివారం బడంగ్‌పేట్‌లో జరుగనున్న బోనాల ఉత్సవాల కోసం రోడ్లను బాగు చేయించడానికి చర్యలు తీసుకోనున్నట్టు 20వ డివిజన్ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన డివిజన్‌లోని షిరిడీ ఎన్‌క్లేవ్‌లో గల అమ్మవారి ఆలయాలను సందర్శించి అక్కడి రోడ్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ భక్తులు అమ్మవార్ల ఆలయాలకు బోనాలతో సాఫీగా వెళ్లేలా రోడ్లు బాగు చేయిస్తామని, వీధులన్నింటినీ శుభ్రంగా మారుస్తామని పేర్కొన్నారు. భక్తులు శాంతియుత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు శేఖర్, కుమారస్వామి, బాబుల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నరేశ్, అనిల్, నయనాచారి, విష్ణుమూర్తి, భగవాన్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం కబ్జాపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బాటసింగారంలో ప్రభుత్వ స్థలం కబ్జాపై గ్రామ మాజీ ఎంపీటీసీ, బీజేపీ మండల అధ్యక్షుడు బండిగారి విష్ణుగౌడ్ అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ రవీందర్‌దత్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. కొత్తగూడెంకు చెందిన ఒంటెద్దు ఆంజనేయులు అనే వ్యక్తి బాటసింగారం రెవెన్యూ సర్వే నంబర్ 10లోని ప్రభుత్వ భూమిలో 500 గజాల స్థలాన్ని ఆక్రమించినట్లు తెలిపారు. నకిలీ పత్రాలు సృష్టించి సదరు స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకుని కబ్జా చేశాడని ఆరోపించాడు. దాని విలువ కోట్లల్లో ఉంటుందన్నారు. విచారణ జరిపి సదరు ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు. ప్రభుత్వ భూమి ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విష్ణుగౌడ్


విద్యాశాఖ ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న తల్లిదండ్రులు

నిబంధనలు పాటించని స్కూల్‌పై చర్యలు తీసుకోండి

సైదాబాద్, జూలై 24(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంతో పాటు, నిబంధనలు పాటించని సైదాబాద్ జయనగర్‌లోని సెయింట్ ఆండ్రూస్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ విద్యార్థుల తల్లిదండ్రులు బుధవారం మండల విద్యాశాఖ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సమస్యలపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో తల్లిదండ్రులు అబ్దుల్ అజీజ్, అబ్దుల్ వహీద్, షేక్ రషీద్, మస్తాన్, మహేష్, అహ్మద్, నూర్ మహ్మద్, రఫీ, మస్తాన్‌లు తెలిపారు. స్కూల్‌పై ఫిర్యాదు చేస్తే తమ పిల్లలను వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.


దోమల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఎంటమాలజీ సిబ్బంది

దోమల వృద్ధిని నివారించడంతోనే వ్యాధులు దూరం

కొత్తపేట, జూలై 24(ఆంధ్రజ్యోతి): దోమల వృద్ధిని నివారించడంతోనే వ్యాధులు దూరం చేసుకోవచ్చని ఎంటమాలజీ ఇన్‌సెక్టు కలెక్టర్ సుదర్శన్ తెలిపారు. జీహెచ్ఎంసీ సరూర్‌నగర్ సర్కిల్- 05 ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో బుధవారం సిబ్బంది కొత్తపేట డివిజన్ పరిధిలోని బాలాజీనగర్, రాఘవేంద్రకాలనీల్లో ఇంటింటికీ తిరుగుతూ యాంటీ లార్వల్ ఆపరేషన్ చేపట్టారు. వాడని టైర్లు, డబ్బాలు, కుండలు, పూలకుండీల్లో నిలిచిన నీటిలో దోమల లార్వాలు పెరిగే అవకాశం ఉందని ప్రజలను అప్రమత్తం చేశారు. వారంలో ఒక రోజు డ్రైడేను పాటిస్తూ ఇళ్లలో నిలువ ఉండే వర్షం నీటిని తొలగించే పనులు చేయాలని సూచించారు. నిలిచిన నీటిలో పెరుగుతున్న లార్వాలను ప్రజలకు చూపించారు. కార్యక్రమంలో సిబ్బంది సుదర్శన్, చిరంజీవి, మాధవరెడ్డి, ఆర్పీ నర్మద, లక్ష్మయ్య పాల్గొన్నారు.

బ్రిలియంట్ కళాశాలకు అటానమస్ అర్హత


కళాశాలలో కేక్‌కట్ చేస్తున్న ప్రిన్సిపాల్ రుస్తుం తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 24(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్‌లోని బ్రిలియంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్(యూజీసీ) అటానమస్ అర్హత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. షేక్ రుస్తుం తెలిపారు. 2024-2034 సంవత్సరం వరకు బీటెక్, ఎంటెక్, ఎంబీఏ కోర్సులకు అటానమస్ వర్తిస్తుందన్నారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యంతో పాటు అధ్యాపక బృందం ఆనందం వ్యక్తం చేస్తూ కేక్‌కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కసిరెడ్డి రఘోత్తంరెడ్డి, ఏడి వెంకటేశ్వరరెడ్డి, హెచ్‌వోడీ, ఫ్యాకల్టీలు పాల్గొన్నారు.

ర్యాగింగ్ నిర్మూలనకు విద్యార్థులు కృషి చేయాలి

- **సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి**

వనస్థలిపురం, జూలై 24(ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్ నిర్మూలనకు ప్రతి విద్యార్థి కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పీ.శ్రీదేవి అన్నారు. బుధవారం నాగోల్ డివిజన్ బండ్లగూడలోని ఇస్లామియా లా కళాశాలలో యాంటీ ర్యాగింగ్‌పై న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి మాట్లాడుతూ ర్యాగింగ్ అనేది కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో నూతన విద్యార్థులను బెదిరింపులు, వేధింపులు, అవమానాలకు గురిచేసే ఒక నీచమైన పద్ధతికి ప్రతి విద్యార్థి బాధ్యత వహించాలన్నారు. ర్యాగింగ్ అనేది శారీరకంగా, మానసికంగా తీవ్ర పరిణామాలను కలిగిస్తుందని దీనిని తరిమికొట్టాలన్నారు. యాంటీ ర్యాగింగ్‌ను ఎదుర్కొవడానికి, అదేవిధంగా నిరోధించడానికి సమష్టి కృషితో ప్రయత్నించాలని సూచించారు. ర్యాగింగ్ అనేది హానికరమైన పద్ధతని, దీనికి విద్యాసంస్థల్లో స్థానం లేదన్నారు. అనంతరం కళాశాలల్లో ర్యాగింగ్‌ను తొలగించి, విద్యార్థులందరికీ వేధింపులు లేని ఉజ్వల భవిష్యత్‌ను అందిస్తామని ప్రతిజ్ఞ చేద్దామని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఖాజా అవెయిస్ అహ్మద్, ప్రిన్సిపాల్ కుసుమ కుమారి, సామాజిక కార్యకర్త అబ్దుల్ వాసి, న్యాయ్యవాదులు తాహెర్ హుస్సేన్, వాజీద్, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి

ప్రభుత్వ పాఠశాలలపై మంత్రి స్పందన హర్షణీయం

- **టాయ్‌లెట్స్ సమస్య గుర్తించినందుకు ధన్యవాదాలు**
- **బడంగ్‌పేట్ డిప్యూటీ మేయర్ శేఖర్**

సరూర్‌నగర్, జూలై 24(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలు ఎదుర్కొంటున్న టాయ్‌లెట్స్ సమస్యపై రాష్ట్ర ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు తక్షణమే స్పందించడం హర్షణీయమని డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ అన్నారు. ఇటీవల బడంగ్‌పేట్‌లో జరిగిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రికి.. తాను టాయ్‌లెట్స్ సమస్యను వివరించానని, దాంతో మంత్రి వెంటనే స్పందించి పాఠశాలలను సందర్శించి పరిస్థితులపై నివేదిక తయారు చేయాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు, పార్టీ నాయకులకు సూచించడం శుభపరిణామమని ఆయన పేర్కొన్నారు. బుధవారం బడంగ్‌పేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శేఖర్ మాట్లాడుతూ మంత్రి సూచన మేరకు రెండ్రోజుల క్రితం మేయర్ పారిజాతానర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ తదితరులు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారని, వారికి అక్కడి సమస్య ప్రత్యక్షంగా తెలిసి వచ్చిందని అన్నారు. కేవలం పర్యటనలకే పరిమితం కాకుండా కార్యాచరణ దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఉన్నదని ఆయన వ్యాఖ్యానించారు. టాయ్‌లెట్స్ నిర్మించడం ఎంత ముఖ్యమో వాటిని సక్రమంగా నిర్వహించడం సైతం అంతే ముఖ్యమని, దీనిపై దృష్టి పెట్టాలని ఆయన కోరారు. మంత్రికి కార్పొరేషన్ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.


మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ శేఖర్


జీపీని సన్మానిస్తున్న రంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు

జీపీ అనంతసేనారెడ్డిని సన్మానించిన న్యాయవాదులు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, జూలై 24(ఆంధ్రజ్యోతి): హైకోర్టులో మైన్స్, ఇండస్ట్రీస్ ప్రభుత్వ ప్లీడరుగా నియమితులైన అనంతసేనారెడ్డిని రంగారెడ్డి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్‌లో బుధవారం ఘనంగా సన్మానించారు. రంగారెడ్డి జిల్లాకు చెందిన సీనియర్ న్యాయవాది అయిన అనంతసేనారెడ్డి హైకోర్టు జీపీగా నియమితులవడం పట్ల జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కొండల్‌రెడ్డి, కృష్ణ సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు సుధాకర్‌రెడ్డి, పులిగారి గోవర్ధన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, కృష్ణ, నాగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజధాని ఏసీ చార్జీలకే గరుడ ప్లస్‌లో ప్రయాణించే అవకాశం

చాదర్‌ఘాట్, జూలై 24(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ గరుడ ప్లస్ చార్జీలను తగ్గించింది. ఈ మేరకు కొత్త ఆఫర్‌ను ప్రకటించింది. రాజధాని ఏసీ చార్జీలకే గరుడ ప్లస్‌లో ప్రయాణించే అవకాశం కల్పించినట్లు రంగారెడ్డి రీజినల్ మేనేజర్ శ్రీలత తెలిపారు. ఈ అవకాశం వచ్చే సెప్టెంబర్ 30వ తేదీ వరకు బుకింగ్ చేసుకున్న వారికి ఈ ఆఫర్ వర్తిస్తుందని ఆమె వివరించారు.


సీసీ రోడ్డు పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టాలి: రాగుల

వనస్థలిపురం, జూలై 24(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో చేపడుతున్న సీసీ రోడ్డు పనులు భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా నాణ్యతతో చేపట్టాలని కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. బుధవారం డివిజన్‌లోని రాజిరెడ్డినగర్ నుంచి వెంకటరమణ కాలనీ మీదుగా శక్తినగర్ వరకు నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన


సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వనస్థలిపురం, జూలై 24(ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి పనులు చేపట్టాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్‌లోని ఎస్కేడినగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నూతన సీసీ రోడ్డు పనులను నాణ్యతా ప్రమాణాలు పాటించి, ఎత్తు పల్లాలు సరిచూసుకుని ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

ఇద్దరు కేంద్రమంత్రులు రాజీనామా చేయాలి

ఓల్డ్‌మలక్‌పేట, జూలై 24(ఆంధ్రజ్యోతి): తెలంగాణాలో కేంద్రమంత్రులుగా కొనసాగుతున్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు మంత్రి పదవులకు తక్షణమే రాజీనామా చేయాలని కాంగ్రెస్ ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ అధ్యక్షుడు మహ్మద్ షకీల్ డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఓల్డ్‌మలక్‌పేటలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గురించి గొప్పలు చెప్పే ఎనిమిది మంది ఎంపీలు, ఇద్దరు మంత్రులు ఉండి తెలంగాణకు ఒక్క పైస కూడా తేలేకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. విభజన చట్టం ఆంధ్రాకు వర్తించినప్పుడు తెలంగాణకు ఎందుకు వర్తించదన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని రాబోయో రోజుల్లో తెలంగాణాలో ఆ పార్టీని ప్రజలు బొందపెట్టడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు చక్రపాని, మహేశ్‌కుమార్, రాహుల్‌సింగ్, విగ్నేష్, సంపత్, సర్వేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నేటి నుంచి జేఈ వ్యాక్సినేషన్ క్యాంపెయిన్

చాదర్‌ఘాట్, జూలై 24(ఆంధ్రజ్యోతి): దోమల ద్వారా సంక్రమించే వ్యాధుల్లో ప్రాణాంతకమైన బ్రెయిన్ ఫీవర్ వైరస్ సోకకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా గురువారం నుంచి జేఈ వ్యాక్సినేషన్ క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు మలక్‌పేట క్లస్టర్ డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌వో డాక్టర్ బీర్జీస్ ఉన్నీసా తెలిపారు. ఈనెల 25వ తేదీ నుంచి ఆగస్టు 25వ తేదీ వరకు 9నెలల చిన్నారుల నుంచి 15ఏళ్ల యువకుల వరకు జేఈ వాక్సినేషన్ ఉచితంగా వేయనున్నట్లు ఆమె వివరించారు. మలక్‌పేట క్లస్టర్ పరిధిలోకి వచ్చే శాలివాహననగర్, గడ్డిఅన్నారం, మలక్‌పేట, జాంబాగ్‌పార్క్, మాదన్నపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలలు, మదర్సాలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లకు చెందిన దాదాపు 30,548 మంది విద్యార్థులకు జేఈ వ్యాక్సినేషన్ ఉచితంగా వేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆమె తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3.30గంటల వరకు పాఠశాలల్లో జేఈ వ్యాక్సిన్ వేసేందుకు 21 మంది ఏఎన్ఎంలను ప్రత్యేకంగా నియమించినట్లు ఆమె తెలిపారు. ఒక్కో పాఠశాలలో ఒక్కో ఏఎన్ఎం జేఈ వ్యాక్సిన్ వేస్తారన్నారు. పూర్తిగా వైద్యుల సూచనల మేరకే జేఈ వ్యాక్సిన్ వేయించుకోవాలని ఆమె తెలిపారు.

బీజేపీ దళిత నాయకుడిపై దాడి దారుణం

- **దళితమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్**

సరూర్‌నగర్, జూలై 24(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని 29వ డివిజన్‌కు చెందిన బీజేపీ నాయకుడు మహేందర్‌పై బీఆర్ఎస్ శ్రేణుల దాడి దారుణమని, జరిగిన సంఘటనను తాను తీవ్రంగా ఖండిస్తున్నానని బీజేపీ దళితమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండెపి శ్రీధర్ అన్నారు. దాడిలో గాయపడిన మహేందర్‌ను బుధవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ బాధితుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేస్తే కేవలం ఒక్కరిపైనే కేసు నమోదు చేసి చేతులు దులుపుకోవడం ఎంత వరకు సమంజసమని నిలదీశారు. జనరల్ స్థానంలో పోటీ చేశాడనే అక్కసుతోనే దళితుడైన మహేందర్‌పై ఆ పార్టీ నేతల ప్రోద్బలంతో దాడికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. ఇక్కడ న్యాయం జరగకపోతే జాతీయ ఎస్సీ కమిషన్‌లో ఫిర్యాదు చేస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో దళిత మోర్చా రాష్ట్ర నాయకులు గూడూరు అంబేడ్కర్, కాశీపేట శివాజీ, కొండ్రు పురుషోత్తం, బచ్చిగల్ల రమేశ్, జిల్లా నాయకులు కుంటి భాస్కర్, గుండె నాగార్జునబాబు, బీజేపీ బడంగ్‌పేట్ శాఖ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, యువమోర్చా అధ్యక్షుడు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి, పోలె రాజు, శ్రీనివాస్, మల్లేశ్ పాల్గొన్నారు.

ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడంలో ఆర్టీసీది కీలకపాత్ర : సీఐ వెంకటేశ్వర్లు

హయత్‌నగర్, జూలై 24(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లోని ఆర్టీసీ 1- 2 డిపోల ఆధ్వర్యంలో బుధవారం హయత్‌నగర్ బస్ టర్మినల్‌లో ప్రమాద రహిత వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం ట్రాఫిక్ సీఐ వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడుతూ ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడంలో ఆర్టీసీ కీలకంగా వ్యవహరిస్తుందన్నారు. పద్మవ్యూహం లాంటి నగరంలో బస్సులు నడపడం గొప్ప విషయం అన్నారు. ప్రమాదాలను ముందే పసిగట్టి డ్రైవర్లు చాకచక్యంగా బస్సులు నడుపుతారని అన్నారు. డ్రైవర్లు ఎట్టి పరిస్థితులలో మద్యం సేవించి బస్సు నడపరాదని కోరారు. అదేవిధంగా బస్సు నడుపుతూ సెల్‌ఫోన్ మాట్లాడకూడదని అన్నారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు ఎలాంటి ప్రమాదాలు చేయని డ్రైవర్లను సీఐ సన్మానించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్లు విజయ్, శ్రీనివాసరావు, సహాయ మేనేజర్ విజయకుమారి, రమాదేవి, ఉద్యోగులు మైసయ్య, నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.


ప్రమాదాలు చేయని డ్రైవర్లను సన్మానిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు

సరూర్‌నగర్, జూలై 24(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్ 16వ డివిజన్‌లోని లయన్స్ క్లబ్ భవనంలో దీన్‌దయాల్‌నగర్, కళానగర్‌లలో గల ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ జిల్లెలగూడ గీతాంజలి ఆధ్వర్యంలో, శ్రీనేత్రాలయ కంటి ఆస్పత్రి సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని మేయర్ దుర్గా దీప్‌లాల్ ప్రారంభించారు. ఈ శిబిరంలో దాదాపు 200 మంది విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. లయన్స్ ప్రతినిధులు డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డి, హరిబాబు, మహేందర్‌రెడ్డి, బుచ్చయ్య, భాస్కర్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, హరీశ్‌రెడ్డి, వేణుమాధవ్, అంజయ్య, హెడ్మాస్టర్లు మంజుల, మహేశ్వరి, నేత్ర వైద్యులు డాక్టర్ అనిత పాల్గొన్నారు.


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ విశ్వనాథ్‌గౌడ్, సభ్యులు

విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ

చంపాపేట, జూలై 24(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని పోచమ్మ టెంపుల్ గ్రౌండ్‌లో ఆగస్టు 6నుంచి 10వరకు పోచమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, బోనాల మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఎరుకల విశ్వనాథ్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం ఆలయ ఆవరణలో మహోత్సవాల బ్రోచర్‌ను ఆలయ కమిటీ సభ్యులతో కలిసి విశ్వనాథ్‌గౌడ్ ఆవిష్కరించారు. ఆలయ వ్యవస్థాపకుడు ఎరుకల కృష్ణగౌడ్ కృషితో లక్షలు వెచ్చించి సుందరంగా నూతన ఆలయ నిర్మాణం చేపట్టినట్లు ఆయన తెలిపారు. చాముండేశ్వరీ గురుదత్తపీఠం వ్యవస్థాపకుడు కొడగండ్ల శ్రీరామశరణ్‌శర్మ గురూజీ ఆధ్వర్యంలో ఆగస్టు 6న ఆలయంలో గురుపూజ, గణపతిపూజ, యాగశాల ప్రవేశం, 7న ప్రాతఃకాల పూజలు, 8న రుద్రహోమం, 9న పోచమ్మ అమ్మవారి యంత్ర ప్రతిష్ఠ, 10న ఉదయం పోచమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన, శిఖర ధ్వజస్తంభ సంప్రోక్షణ, 11న పోచమ్మ అమ్మవారి బోనాలు, 12న సాయంత్రం పోచమ్మ అమ్మవారి ఘటాల ఊరేగింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.


ఆలయ కమిటీ ప్రతినిధులకు చెక్కు అందజేస్తున్న భాస్కర్‌రెడ్డి

పోచమ్మ ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

సరూర్‌నగర్, జూలై 24(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్ జిల్లెలగూడ 17వ డివిజన్‌లోని పాత గ్రామంలో గల పోచమ్మ ఆలయ పునర్నిర్మాణం నిమిత్తం కార్పొరేటర్ పోరెడ్డి పద్మారెడ్డి భర్త, మాజీ ఎంపీటీసీ పోరెడ్డి భాస్కర్‌రెడ్డి రూ.1.51లక్షలు విరాళంగా ప్రకటించారు. దీనికి సంబంధించిన చెక్కును బుధవారం ఆలయ కమిటీకి అందజేశారు. వచ్చే బోనాల నాటికి ఆలయాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా ఆయన ఆలయ కమిటీ ప్రతినిధులకు సూచించారు. కార్యక్రమంలో కొత్త మధుసూదన్‌రెడ్డి, మల్లెల నరేందర్‌రెడ్డి, జిల్లెల దామోదర్‌రెడ్డి, సప్పిడి యాదిరెడ్డి, కుంటల వల్లభ్‌రాజ్‌గౌడ్, బొక్క అంజిరెడ్డి, పోరెడ్డి జంగారెడ్డి, సుధాకర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, అర్కల కాశీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు బాలాపూర్‌లో బోనాల వేడుకలు

సరూర్‌నగర్, జూలై 24(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్‌లో గురువారం బోనాల పండుగ జరుపుకోనున్నారు. ప్రతియేటా సికింద్రాబాద్ బోనాల జాతర ముగిసిన తర్వాత వచ్చే గురువారం రోజు ఇక్కడ బోనాల వేడుకలు నిర్వహిస్తుంటారు. ఈ క్రమంలో ఈ ఏడాది సైతం గురువారం బాలాపూర్‌లో బోనాల వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. పోచమ్మ, మైసమ్మ, ఎల్లమ్మ, ఈదమ్మ, కాటమయ్య తదితర ఆలయాల వద్ద భక్తులకు అవసరమైన విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు బడంగ్‌పేట్ మేయర్ భర్త, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన పలు ఆలయాలను సందర్శించి అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బోనాల మహోత్సవాన్ని ఆనందోత్సాహాలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, జూకంటి సురేశ్‌గౌడ్, కృష్ణంరాజుగౌడ్, అరవింద్, ఆయా ఆలయాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓల్డ్ మలక్‌పేటలో 28,29 తేదీల్లో..

ఓల్డ్‌మలక్‌పేట, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఓల్డ్‌మలక్‌పేట పోచమ్మ ఆలయంలో ఈనెల 28,29 తేదీల్లో బోనాల పండుగను ఘనంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ చౌకి రవికుమార్ తెలిపారు. బుధవారం పోచమ్మ ఆలయం వద్ద బోనాల పండుగ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు భక్తిశ్రద్ధలతో సంప్రదాయం ప్రకారం బోనాలు జరుపుకోవాలని కోరారు. ఆలయం వద్ద పండుగ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బాబుశ్రీనివాస్, శంకర్‌ముదిరాజ్, సురేష్ కుమార్, వాసు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


చెత్త రిక్షాను ప్రారంభిస్తున్న ఉపకమిషనర్ సుజాత

చెత్త రిక్షా ప్రారంభం

ఎల్బీనగర్, జూలై 24(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య పనుల నిర్వహణ కోసం సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో అసోసియేషన్ ఆధ్వర్యంలో అందజేసిన చెత్త రిక్షాను సరూర్‌నగర్ సర్కిల్ ఉపకమిషనర్ సుజాత బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణలో జీహెచ్ఎంసీకి ప్రజలు కూడా తోడ్పాటు అందించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె అన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ డీఈ నీలిమ, ఎస్ఎఫ్ఏ శ్రీను, కాలనీ సంక్షేమ సంఘం ఇన్‌చార్జి, సీనియర్ ఉపాధ్యక్షుడు మారోజు శ్రీనివాసరావు, కోశాధికారి సాయికిరణ్, తోర్పునూరి శ్రీనివాస్‌రావు, మధుసూదన్‌రెడ్డి, విజయ్‌కుమార్, నరేష్, సుధాకర్‌చారి, ఎంవీఎస్ ప్రసాద్, మురళీ కౌండిన్య, కనకారావు, వెంకటసాయి పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో తల్లీకొడుకు ఆత్మహత్య

- **కొద్ది రోజుల క్రితమే ఇంటి పెద్ద అనారోగ్యంతో మృతి**

దిల్‌సుఖ్‌నగర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఆ ఇంటి పెద్ద కొద్ది రోజుల క్రితమే అనారోగ్యంతో మృతి చెందాడు.. తానే పెద్ద దిక్కై తమ ఇద్దరు కుమారుల బాగోగులు చూసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తుంది. ఆ తల్లి.. ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక చివరకు తానూ ఆత్మహత్య చేసుకుంది.. తల్లి మృతదేహాన్ని చూసి షాక్‌కు గురైన కుమారుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషాదకర సంఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి జరిగింది. చైతన్యపురి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒంగోలుకు చెందిన గుంజి శివ, పద్మ దంపతులు తమ ఇద్దరు కుమారులతో కలిసి బతుకుదెరువు కోసం కొన్నేళ్ల క్రితం నగరానికి వసలవచ్చి కొత్తపేట ఎస్ఎల్ఆర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. కొద్ది నెలల క్రితం అనారోగ్యంతో శివ మృతిచెందాడు. దీంతో పద్మ తానే పెద్ద దిక్కై ఇద్దరు కుమారులను పోషిస్తుంది.


తల్లీకొడుకుల మృతదేహాలు

తల్లి మరణాన్ని జీర్ణించుకోలేక కొడుకు..

కుటుంబ పోషణ భారం కావడం, ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టడంతో కొంత కాలంగా పద్మ తీవ్ర మానసిక క్షోభను అనుభవిస్తోంది. ఆర్థిక ఇబ్బందులను తాళలేక కుమారులిద్దరూ ఇంట్లో లేని సమయంలో బుధవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుంది. రాత్రి సమయంలో ఇంటికి వచ్చిన పెద్ద కుమారుడు వంశీ(18) తల్లి మృతదేహాన్ని చూసి షాక్‌కు గురయ్యాడు. తల్లి మరణాన్ని జీర్ణించుకోలేకపోయిన అతడు అదే గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. సమాచారం అందుకున్న చైతన్యపురి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.